ఎమ్మెల్సీ కవితను కలిసిన ఆరెకటిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జహంగీర్‌జీ

నిధులు కేటాయించేలా ఒత్తిడి తీసుకురావాలి

కడ్తాల్, డిసెంబర్ 26 : భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను గురువారం ఆమె నివాసంలో తలకొండపల్లి మండలానికి చెందిన ఆరెకటిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్‌కార్ జహంగీర్‌జీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆరెకటికలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించినట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో 20 లక్షల మంది ఉన్న ఆరెకటికలు అభివృద్ధికి నోచుకోలేక జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఆరెకటికలు నిర్వహిస్తున్న మండలితో ప్రభుత్వానికి నిధులు సమకూరుతున్నా.. వారి అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించడంలేదని వివరించారు. ఆరెకటికల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి.. రూ.1000 కోట్ల నిధులను కేటాయించేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్సీని కోరినట్లు తెలిపారు.

ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ అప్రజాస్వామికం

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, డిసెంబర్ 26 : బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎ స్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ అప్రజాస్వామికమని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. కాంగ్రెస్ పాలనలో వారిచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఎప్పటికప్పుడు ఎండగడుతున్నందుకే ఈ అక్రమ అరెస్ట్‌లా? అని మండిపడ్డారు. కుట్రపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి మోసం చేసినందుకుగాను ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేని కాంగ్రెస్ అణచివేయడం పనిగా పెట్టుకున్నదన్నారు. అక్రమ కేసులు చూపి ప్రతి పక్ష నాయకులను, అటు ప్రజలను భయపెట్టాలని ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

రేపు రతన్‌టాటా ఎక్సలెన్సీ అవార్డుల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 26 : తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆబిడ్స్ తిలక్‌రోడ్డు బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో డిసెంబర్ 28న శనివారం ఉదయం 10గంటలకు ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా జయంతి సందర్భంగా పలువురు ప్రొఫెసర్లకు రతన్ టాటా ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రతన్‌టాటా జీవిత చరిత్రపై నగరంలోని పలు ఎంబీఏ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుశోత్తం తదితర ప్రముఖులు హాజరు కానున్నారన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయింపు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

కొడంగల్‌లోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, డిసెంబర్ 26 : నియోజకవర్గ పరిధిలో గురువారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, ఐజీ సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. పట్టణంలోని మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలలో రూ.23కోట్ల45లక్షల వ్యయంతో అదనపు భవన నిర్మాణం, దుద్యాల మండలంలో సమీకృత భవన నిర్మాణం, హకీంపేటలో రూ.78లక్షల వ్యయంతో సమీకృత పాఠశాల, జూనియర్ కళాశాల, ఐటీఐకు సంబంధించిన భూమి ప్రహరీ నిర్మాణం, రూ.7కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న ఉన్నత పాఠశాల, కళాశాల భవనాలకు, హస్నాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన పనులు చేశారు.

దుద్యాల మండల పరిధిలో..

దుద్యాల మండలంలో తాత్కాలిక భవనంలో ఏర్పాటైన నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం, హకీంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక నిధులు కేటాయించి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్య, వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని మహాత్మాజ్యోతీబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మెనూ ప్రకారం భోజన విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్య, మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ఎస్పీ నారాయణ రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాతలు

- రంగారెడ్డి జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న ముసురు
- పత్తి, మిర్చి, ఇతర పంటలకు తీవ్ర నష్టం
- సగం ధరకే విక్రయించుకోవాల్సిన దుస్థితి

జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న ముసురుతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బుధ, గురువారాల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పత్తి ఏరటాన్ని పూర్తిగా నిలిపివేశారు. పత్తి, మిర్చి, మిగిలిపోయిన వరి పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. జిల్లాలో 50 శాతానికి పైగా పత్తి, మిర్చి వంటి పంటలు పొలాల్లోనే ఉన్నాయి. చేతికందివచ్చిన పంటలు తడిసి ముద్దవడంతో రైతులు వాపోతున్నారు.

- రంగారెడ్డి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ)

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పత్తిని తీస్తున్న మహిళా రైతులు

తడిసి ముద్దయిన పత్తి

సగానికి పైగా పత్తి పంట చేళ్లల్లోనే..

రంగారెడ్డి జిల్లాలో మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి, కందుకూరు, కడ్తాల్, షాద్‌నగర్, యాచారం, మంచాల వంటి ప్రాంతాల్లో పత్తి పంట సగానికి పైగా చేళ్లలోనే ఉన్నది. రైతులు పత్తిని అలస్యంగా వేయడం వలన దిగుబడి కూడా అలస్యంగానే వచ్చింది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 1.38లక్షల ఎకరాల్లో పత్తి పంటను వేశారు. 1.50 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేయగా.. సగం పంట కూడా రైతుల చేతికందలేదు. మరో వారం రోజుల్లో పత్తి ఏరటాన్ని ప్రారంభించాలనుకున్న రైతులు అకాలంగా కురుస్తున్న ముసురుతో తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా మాడ్గుల మండలంలోని ఇర్విన్, మాడ్గుల, గిరికొత్తపల్లి తదితర ప్రాంతాల్లో పత్తి పంట పెద్దఎత్తున పొలాల్లోనే ఉన్నది. పత్తి తడవడంతో కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకొచ్చే అవకాశం లేదని.. సగం ధరకే విక్రయించుకోవల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. తడిసిన పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వర్షంలోనే కొనుగోలు చేస్తున్న పత్తి

మద్దతు ధర చెల్లించాలి

తడిసిన పత్తికి మద్దతు ధర చెల్లించాలి. ప్రభుత్వం రైతులపై దృష్టి సారించాలి. కాయకష్టం చేసుకుని జీవించే మాలాంటి పేద రైతులను సర్కారు వెంటనే ఆదుకుని తగిన న్యాయం చేయాలి.

- శంకరయ్య, మాడ్గుల

పత్తి పూర్తిగా తడిసిపోయింది

ఎడతెరిపిలేకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పత్తి పూర్తిగా తడిసిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి ముసురు రూపంలో తీవ్ర నష్టం కలుగుతున్నది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- లక్ష్మయ్య, మాడ్గుల రైతు

దాశరథి కవిత్వాలు శక్తివంతమైనవి

ప్రముఖ కవి,రచయిత నందిని సిధారెడ్డి... బుక్‌ఫెయిర్‌లో సందర్శకుల సందడి

చిక్కడపల్లి,డిసెంబర్26 : ఇందిరాపార్క్ సమీపంలోని కళా భారతి ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ 8వ రోజు సందర్శకులతో సందడి నెలకొంది. గురువారం మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి బుక్ ఫెయిర్‌ను సందర్శించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జరిగే బుక్ ఫెయిర్ అన్ని రకాల పుస్తకాల కూడలి లాంటిందన్నారు. విద్యార్థులు, యువకులు, ప్రతి ఒక్కరూ బుక్ ఫెయిర్‌ను సందర్శించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్ష, కార్యదర్శులు యాకూబ్, ఆర్.వాసు, ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి, కోశాధికారి నారాయణ రెడ్డి, బొమ్మగాని కిరణ్, ప్రముఖ న్యాయవాది బొమ్మగాని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ పుస్తకాలపై అవగాహన ఉండాలి..

బుక్ ఫెయిర్ లో తెలుగు వికీపీడియా లక్ష్యాలు ప్రస్థానం కార్యక్రమంలో 'వికీపీడియా గురించి మీకు తెలుసా' అనే ఉచిత పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వికీపీడియాల్లో ఎక్కువ వ్యాసాలను కలిగిఉన్న జాబితాలోకి చేరడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, వికీపీడియన్లు కృపాల్ కశ్యప్, వి.జె.సుశీల, గుంటుపల్లి రమేశం, ప్రణక్షి రాజ్ వంగరి, నాగరాణి బేతి తదితరులు పాల్గొన్నారు.

మహాకవి దాశరథి పుస్తకావిష్కరణ..

తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో కుసుమ ధర్మన్న కళాపీఠం ముద్రించిన మహాకవి దాశరథి శతజయంతి సందర్భంగా దాశరథి పై రాసిన 'మహాకవి దాశరథి' పుస్తక పరిచయ సభను బుక్ ఫెయిర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, ప్రముఖ కవి,రచయిత నందిని సిధారెడ్డి హాజరై మాట్లాడారు. నిజాం కాలంలో దాశరథి పోరాట ఘట్టాలను వివరించారు. జైలు గోడలపై ఆయన రాసిన కవిత్వాలు ఎంతో శక్తివంతమైనవన్నారు. ఆ కవిత్వాలతో వట్టికోట ఆళ్వారు స్వామి, దాశరథి మధ్య ఉండే ఉద్యమ మైత్రిని వివరించారు. రామకృష్ణ చంద్రమౌళి సభాధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్.ఎన్.బాలాచారి,గంటా మనోహర్ రెడ్డి, నాగయ్య, కళాపీఠం ట్రైపర్సన్ సరోజినీ దేవి, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు చంద్ర ప్రకాశ్ రెడ్డి, రాధా కుసుమ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ శూద్రగంగ' ఆవిష్కరణ..

ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రచించిన 'శ్రీ శూద్రగంగ' వచన రూప కావ్యం ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్ వినోదిని మాదాసు అధ్యక్షత వహించిన ఈ సభలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశీం, లోకకవి అందే శ్రీ, ప్రముఖ సినీ నటుడు,రచయిత ఉత్తేజ్, ప్రముఖ రచయిత భూపతి వెంకటేశ్వర్లు, ప్రముఖ కవి, విమర్శకుడు బెల్లి యాదయ్య, ప్రముఖ కవి, కోయ కోటేశ్వర రావు, అంతర్జాతీయ చిత్రకారుడు ఏలే లక్ష్మణ్, బంగారు బహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి దంపతులకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్‌నారాయణరెడ్డి తదితరులు

రాష్ట్రంలో పర్యటన పూర్తిచేసుకుని గురువారం ఢిల్లీ బయలుదేరి వెళ్లిన ఉపరాష్ట్రపతి దంపతులకు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఉన్నారు.

- రంగారెడ్డి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ)

ధ్యానులందరూ అహింసావాదులుగా మారాలి

ధ్యాన మహాయాగంలో ధ్యానులనుద్దేశించి మాట్లాడుతున్న పరిణతి పత్రీ

పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ

కడ్తాల్, డిసెంబర్ 26 : ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు కరుణ, ప్రేమ, శాకాహారి, అహింసా వాదులుగా ఉండాలన్నదే ధ్యాన గురువు సుభాశ్ పత్రీజీ ఆశయమని పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-3 మహా సభలు గురువారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు సంజయ్‌కింగీ-గణేశ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాతఃకాల సంగీత ధ్యానంలో పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్లోబల్ పిరమిడ్ మాస్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. సుభాశ్ పత్రీజీ కోట్లాది మంది ధ్యానులను తయారు చేశారని తెలిపారు. అనంతరం ధ్యాన గురువులు రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలు, కొత్త సంవత్సర క్యాలెండర్లను ట్రస్ట్ సభ్యులతో కలిసి పరిణతి పత్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాస్టర్లు ఆధ్యాత్మిక సందేశాలు, ధ్యాన అనుభవాలను వివరించారు. సాయంత్రం ప్రధాన వేదికపై కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానులను అలరించాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మీడియా కో-ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన

మహిళలపై దాడి అవాస్తవం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

పరిగి, డిసెంబర్ 26 : లగచర్ల ఘటనలో పోలీసులు మహిళలపై దాడి చేశారనడం అవాస్తవని ఐజీ సత్యనారాయణ వెల్లడించారు. గురువారం ఆయన పరిగిలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కండిషనల్ బెయిల్‌పై ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లు పెట్టడం సరికాదన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు దర్యాప్తును ప్రభావితం చేసేలా ఉన్నాయని, ఆ బెయిల్‌ను రద్దు చేయాలని కోర్టులో పిటిషన్ వేస్తామన్నారు. లగచర్ల ఘటనలో పోలీసుల నిఘా వైఫల్యం లేనే లేదన్నారు. ఘటనలో పాల్గొన్న వారిలో 35 మంది కేవలం నిలబడ్డారని, అందువల్లే వారిని విడిచిపెట్టామన్నారు. పోలీసులు ఎవరినీ కొట్టలేదని, రాత్రివేళ మహిళలను కొట్టారని పేర్కొనడం అబద్ధమన్నారు. తమను కొట్టినట్లు ఎవరూ మెజిస్ట్రేట్‌కు చెప్పలేదన్నారు. పరిగి, తాండూరు ఠాణాల్లో ఎస్‌హెచ్‌వోలుగా సీఐలను నియమించే ప్రతిపాదన ఉన్నదన్నారు. సెగ్మెంట్‌లో కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఠాణాల ఏర్పాటును పరిశీలిస్తామని ఐజీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి ఇల్లు దక్కాలి

సీపీఐ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేటలో సీపీఐ, ప్రజా సంఘాల ర్యాలీ

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 26 : ఇండ్లు లేని నిరుపేదల కోసం సీపీఐ చేపడుతున్న భూ పోరాటాలు విజయవంతం కావాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు దక్కాలన్నారు. సీపీ ఐ శతాబ్ది ఉత్సవాలను గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేటలో ఘనంగా నిర్వహించారు. అం తకుముందు భారీ ర్యాలీగా సభ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో అమరులైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, రేవంత్ సర్కారు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని కోరారు. ప్రతి భారతీయుడి అభ్యున్నతి కోసం పోరాడుతున్న పార్టీ సీపీఐ అని పేర్కొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, డిసెంబర్ 26 : మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం పలువురు నృత్యకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కూచిపూడి నాట్య గురువులు మద్దాలి ఉషా గాయత్రి శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శనలివ్వగా, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు ఆధ్వర్యంలో రూప్‌చంద్ బృందం పురూలీ చౌ జానపద నృత్య ప్రదర్శనలతో అలరించారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

జనవరి 3న కలెక్టరేట్ల ముట్టడి

రవీంద్రభారతి,డిసెంబర్ 26: బడుగు బలహీన వర్గాల విద్యార్థుల రూ.5 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ,బీసీ విద్యార్థులను చదువుకోకుండా కుట్ర చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటిన ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా చెల్లించలేదని అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16 లక్షల 75 వేల మంది విద్యార్థుల ఫీజులు చెల్లించకుండా, కాంట్రాక్టర్ల జేబుల్లోకి వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్నారన్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు ఫీజు బకాయిలు చెల్లించడానికి మనసు అంగీకరించడం లేదని ఎద్దేవా చేశారు. ఫీజు బకాయిలు చెల్లించాలని జనవరి 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా చలో కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎంఆర్ఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని హెచ్చరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను ఉపయోగించుకొని ఇప్పుడు గాలికి వదిలేశారని, ఇదేనా ప్రజాపాలన అని ధ్వజమెత్తారు. విద్యార్థులకు స్కాలర్ షిప్పులు సంవత్సరానికి రూ.5,500లు చెల్లిస్తే ఎక్కడ సరిపోతుందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం రూ.20వేలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్,జల్లపల్లి అంజి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.